క్లుప్తంగా

జనసేనలో గుర్తింపు లేదు

మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: జనసేనలో కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా వారి ఇంట్లో పని చేస్తున్న డ్రైవర్లకు పదవులు ఇవ్వడం తగదని జనసేన పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య పేర్కొన్నారు. కొంత మంది జనసేన పార్టీని ఎదగకుండా చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం గుంటూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి జనసేనలోని కిందిస్థాయి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను ఉద్దేశించి ఆరోపించారు. బర్నాబాస్ హత్య కేసులో తన ప్రమేయం లేదన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగం



పొన్నూరు: వరినాట్లు వేసే పొలంలో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని ఏవో ఆర్. వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కసుకర్రు, చింతలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో పాల్గొని వ్యవసాయ సూచనలు చేశారు. ఎకరాకు 50 కిలోల డీఏపీ ఎరువు, యూరియా 25 కిలోలు కలిపి దమ్ములో వేయాలని తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకుని పంట నమోదు చేసుకోవాలన్నారు. పాత పొన్నూరు పశు వైద్యశాల డాక్టర్. షైనీ మాట్లాడుతూ 6 నెలల దూడలకు నులిపురుగుల మందు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఐ. శ్రీకాంత్, సహాయకులు పి. దుర్గమ్మ, డి. షకీనా, రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పెదకాకాని: మహిళ అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన 38 సంవత్సరాల మహిళ షేక్ నజియా ఈనెల 12వ తేదిన ఇంటి నుండి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. బంధువులకు డబ్బులు ఇవ్వడానికి వెళుతున్నానని చెప్పి వెళ్ళిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులకు సమాచారం తెలిజేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో వెతికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. భర్త షేక్ ఫారుఖ్ ఫిర్యాదు మేరకు నజియా అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం సీఐ నారాయణస్వామి తెలిపారు. ఈ మహిళ గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే పెదకాకాని పోలీసుస్టేషన్ 8688831350 కు సమాచారం అందించాలన్నారు.

డాక్టర్ శ్రీ కృష్ణకు విద్యాసమ్మన్ పురస్కారం



పెదకాకాని(ఏఎన్‌యూ): పంజాబీ సభ మాస్కో(రష్యా)–నేపాల్ సంస్కృత విశ్వ విద్యాలయం–ఖాట్మండులోని వాల్మీకి విద్యాపీఠం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం హిందీ విభాగం సహాయ సమన్వయకర్త డాక్టర్ కాకాని శ్రీకృష్ణకు పురస్కారం అందజేశాయి. ఆ విద్యాసంస్థలు ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ శ్రీకృష్ణ ఆన్‌లైన్ ద్వారా సమకాలీన పరిస్థితులలో భారతీయ జ్ఞాన పరంపరలో జీవన విలువల ఆవశ్యకత అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఈ పరిశోధనా పత్రానికి ప్రాధాన్యత సంతరించుకోవడంతో ఆ విద్యాసంస్థలు డాక్టర్ శ్రీకృష్ణను విద్యాశ్రీ సమ్మన్- 2025 పురస్కారానికి ఎంపిక చేసి అందజేయడం జరిగింది. ఏఎన్‌యు వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తదితరులు పురస్కారం అందుకున్న డాక్టర్ కృష్ణను అభినందించారు.

ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

నెహ్రూనగర్: నగరాన్ని సుందర, పర్యావరణ హిత నగరంగా, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు, కర్రి పాయింట్స్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేధించిన నగరంగా తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

సంక్షేమాన్ని కూటమి విస్మరించింది

- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వేర్వేరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం



కట్టెంపూడిలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. మంగళవారం మండలంలోని కట్టెంపూడి, ఆలూరు, దొప్పలపూడి, పచ్చల తాడిపర్రు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు మోసపూరిత హామీలతో ప్రకటించిన మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత కట్టెంపూడిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో సంక్షేమాన్ని మరిచి, నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి నేడు చేతులెత్తేశారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద మహిళకు రూ. 18,000 ఏడాదికి ఇస్తామని చెప్పి ఇప్పుడేమో ఆ పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలని హేళనగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

సంపదలేవీ బాబూ..?

సంపద సృష్టించి సంక్షేమం నాలుగు రెట్లు అమలు చేస్తామని ఇంటింటికీ తిరిగి బాండ్లు ఇచ్చి, ఇప్పుడేమో సంపద ఎలా ఉందో సృష్టించాలో చెప్పాలంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్నివర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

అలాగే గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను నిలిపివేశారన్నారు. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దుచేసి కార్డుదారులకు కష్టాలు తెచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు మోసాన్ని ప్రతి గడపకూ తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గం పెన్షనర్స్, ఎంప్లాయిస్ అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మరియ రాణి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలాలి, ఇంటలెక్చువల్ అధ్యక్షుడు రవీంద్ర బాబు, వైద్యుల విభాగం అధ్యక్షుడు మామిళ్ళపల్లి మోహన్ రావు, సీనియర్ నాయకులు రుద్రపాటి ఆదిశేషు, వడాలశెట్టి శివ నాగులు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చుండూరు వీరయ్య, కే. సుశోభిత, కంచర్ల కరుణ బాబు, రుద్రపాటి నాగేశ్వరరావు, చేబ్రోలు నాగరాజు, చేబ్రోలు ప్రవీణ్, రుద్రపాటి నరేంద్ర, రుద్రపాటి వెంకటేష్, సోను, నాగార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధగా ఉండాలని, ఫిర్యాదులను ర్యాండమ్‌గా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు తెలిపారు. మంగళవారం పీజీఆర్ఎస్‌కి అందిన ఫిర్యాదు మేరకు గోరంట్ల అన్నపూర్ణనగర్, సరస్వతి కాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలు తమ స్థానిక సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉండడానికి వీలు లేదని, నేరుగా అర్జీదారులతో తామే మాట్లాడుతామన్నారు. అన్నపూర్ణనగర్, సరస్వతి కాలనీల్లో మౌలిక వసతుల సమస్యలపై అందిన అర్జీని పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు.

అలాగే తాగునీటిని అన్ని ప్రాంతాలకు నిర్దేశిత సమయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నపూర్ణనగర్ 5వ లైన్‌లో పెద్ద చెట్టుని అనుమతి లేకుండా నరికివేయడం గమనించి, స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణం వారిపై వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేసి, నోటీసులు ఇచ్చి, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. సదరు ప్రాంతంలోనే మ్యాన్ హోల్ రోడ్ లెవల్ కి కిందకు ఉండడం, సీసీ రోడ్, డ్రైన్ వెంబడి గ్యాప్, నిర్మాణ వ్యర్థాలు ఉండడం గమనించి తక్షణం మ్యాన్ హోల్‌ని పైకి నిర్మాణం చేయాలన్నారు. డ్రైన్, రోడ్లకు మధ్యలో గ్యాప్ లేకుండా, నిర్మాణ అనంతరం వ్యర్థాలు తొలగించడం సంబంధిత కాంట్రాక్టర్‌దే బాధ్యతని, అందుకు తగిన విధంగా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి, ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, స్థల యజమానులను గుర్తించి, శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించని వారి స్థలలో జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ శ్రీనివాస్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి రేణుక



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ రేణుక

పెదకాకాని: విద్యార్థులు పీఎంశ్రీ వనరులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రేణుక అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)కి ఎంపిక కావడంపై మంగళవారం పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా డీఈఓ రేణుక మాట్లాడుతూ అఖిల భారత శిక్షా సమాగమంలో భాగంగా జిల్లాలోని 26 పాఠశాలల్లో వెనిగండ్ల జడ్పీహెచ్ స్కూల్ మాత్రమే పీఎంశ్రీ పథకానికి ఎంపికైందన్నారు. ఈ పథకం ద్వారా మంజూరు కాబడిన సుమారు 90 లక్షల రూపాయల నిధులతో పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ, నూతన భవనం, ఆటస్థలం ఏర్పాటు చేయడంతో పాటు పలు వనరులు సమకూరుతాయన్నారు. 2020 జాతీయ విద్యా విధానం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పీఎంశ్రీ పథకాన్ని దేశానికి అంకితం చేయనున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యావనరులను సద్వినియోగం చేసుకున్న ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని సాధించే వరకూ కష్టపడి విద్యనభ్యసించాలని సూచించారు. వెనిగండ్ల పాఠశాల జిల్లాలోనే ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించారు. ఢిల్లీలో జరుగుతున్న విద్యాసదస్సు ఎల్ఈడీ ద్వారా పిల్లలతో కలసి తిలకించారు. ముందుగా పాఠశాలలో పీఎం శ్రీ పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యం

జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు



వర్మీకంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు

ప్రత్తిపాడు: గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని సుప్రీమ్ ఎల్‌టీసీ (ఎస్‌డబ్ల్యూపీసీ)ని మంగళవారం జెడ్పీ సీఈవో సందర్శించారు. కంపోస్టు ఎరువు తయారీ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయు విధానం, మొక్కల పెంపకం, నాడెప్ తొట్టెల వినియోగం.. వంటి పలు విషయాలను కూలంకుషంగా పరిశీలించారు. తొలుత గ్రామంలో జరుగుతున్న డోర్ టు డోర్ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి, క్లాప్‌మిత్రలతో మాట్లాడారు. చెత్త సేకరించు విధానం, ప్రజలు సహకరిస్తున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డులు, ఐఈసీ యాక్టివిటీలపై ఆరా తీశారు. వెంట ఈవోపీఆర్డీ షేక్ షఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రాలు ఉన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల చేసే ప్రాంతాలు

గుంటూరు రూరల్: రోడ్డువైండింగ్ కారణాల వల్ల బుధవారం నగరంలో, శివారు ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యంలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి 12 సెక్షన్ పరిధిలో మిర్చియార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షిదయానందనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

మంగళగౌరీగా కనకమహాలక్ష్మీ అలంకరణ



నగరంపాలెం: స్థానిక సిద్ధార్థనగర్ 11వ వీధిలోని శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో మంగళవారం శ్రావణ మాస విశేష కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి శ్రావణ మంగళవారం పూజ, కుంకుమార్చనలు విశేషంగా నిర్వహించారు. ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులు, మహిళలకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి పర్యవేక్షించారు.

ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

నెహ్రూనగర్: నగరాన్ని సుందర, పర్యావరణ హిత నగరంగా, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు, కర్రి పాయింట్స్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేధించిన నగరంగా తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని, చుట్టుపక్కల ప్రజలు, మిత్రులకు అవగాహన కల్పిస్తామని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ ఎంహెచ్‌ఓలు రామారావు, సోమశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ నిలిపివేయండి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం రామారావు

ప్రత్తిపాడు: స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని సీపీఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం కరెంటు చార్జీలను పెంచుతున్న తీరు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఎన్నికలకు ముందు మాట్లాడిన మాటలు, ఇప్పుడు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలు తక్షణమే తగ్గించాలన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ వెంటనే నిలిపివేసి, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే అదనంగా వసూలు చేసిన రూ. 2,787 కోట్ల రూపాయలను వినియోగదారులకు చెల్లించాలని రామారావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యుత్ చార్జీల భారం తగ్గించకపోగా మరింత పెంచిందన్నారు. సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీన పెదనందిపాడు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీవైభవ్

పెదకాకాని: రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఫైనాన్సియల్ ఎనలిస్ట్ శ్రీవైభవ్ అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫైనాన్సియల్ ఎనలిస్ట్ శ్రీవైభవ్ హాజరయ్యారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి రమణకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీవైభవ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న తీరును రైతులు, అధికారులతో చర్చించారు. క్రాప్ ఇన్సూరెన్స్ కాలపరిమితి గ్రామం యూనిట్‌గా కాకుండా వ్యక్తిగతంగా ఉండాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారిణి దీపిక, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, సీజీజీబీ బ్యాంక్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లావాసి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లావాసి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా బనగానపల్లి మండలంకు చెందిన పాణ్యం రవి (30) చిలకలూరిపేట వైపునుంచి గుంటూరుకు తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎన్‌హెచ్ 16లో ఏటుకూరు వద్ద అకస్మాత్తుగా కుక్క రోడ్డుపైకి రావటంతో కుక్కను ఢీకొని ద్విచక్రవాహనంతోపాటు కిందపడిపోయాడు. అదే సమయంలో వెనుకగా చిలకలూరిపేట వైపునుంచి వస్తున్న లారీ అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు సంఘటన స్థలికి చేరుకున్నారు. లారీ ఢీకొని ఛిద్రమైన మృతదేహాన్ని కోవిడ్‌ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సహాయంతో జీజీహెచ్ మార్చురికి తరలించారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించి మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరివర్తన తీసుకువచ్చేందుకే బాలన్యాయ చట్టం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యురాలు అనురాధానాయుడు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యురాలు అనురాధానాయుడు

పెదకాకాని: భారతదేశంలో బాల నేరస్తుల న్యాయ వ్యవస్థ ప్రధాన లక్ష్యం వారిని సాధారణ నేరస్తుల వలే శిక్షించకుండా సంరక్షించే విధంగా బాల న్యాయ సంరక్షణ, పోషణ చట్టాన్ని రూపొందించారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యురాలు అనురాధానాయుడు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో జువనైల్ జస్టిస్ అనే పాఠ్యాంశంపై ఎల్ఎల్‌బీ హానర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమ, మంగళవారాలు ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన అనురాధ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తి నేరాలకు పాల్పడినప్పుడు అతని విషయంలో బాల న్యాయ (బాలల సంరక్షణ పోషణ) చట్టాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఏడు సంవత్సరాల లోపు పిల్లలు నేరాలు చేసినప్పటికీ వారిలో నేర ఉద్దేశాన్ని నిర్ధారించటం ఔచిత్యం కాదు కాబట్టి ఆ వయసులోపు పిల్లలని నేరస్తులుగా నిర్ధారించటం లేదని చెప్పారు. కానీ 18 ఏళ్ల లోపు పిల్లలు నేరాలకు పాల్పడితే వారిలో పరివర్తన తీసుకువచ్చి ఆ బాల నేరస్తులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు బాలల ప్రత్యేక గృహం, ప్రత్యేక పాఠశాలలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. బాలలు నేరం చేసినట్లయితే వారిని జైల్లో కానీ, పోలీస్ స్టేషన్ లాక్‌అప్ లో కూడా ఉంచకూడదని బాల న్యాయ సవరణ చట్టం పేర్కొంటుందన్నారు. చట్టంలో వచ్చిన మార్పుల కారణంగా 16 నుంచి 18 సంవత్సరాల లోపు బాలలు క్రూరమైన నేరాలు చేస్తే వారిని పెద్దవారిగానే భావించి చట్ట ప్రకారం విచారణ చేసి శిక్షలు అమలు చేసే సంఘటనలు కూడా తలెత్తిన విధానాన్ని ఆమె వివరించారు.

ఈ చట్టం కింద ఏర్పాటు అయిన జువనైల్ జస్టిస్ బోర్డు, బాలల సంక్షేమ కమిటీలు, బాలల యొక్క సంరక్షణ, పోషణలను సమర్థవంతంగా నిర్వహించే విధానాన్ని వివరించారు. యునైటెడ్ నేషన్ ఆఫ్ ది కన్వెన్షన్ ఆఫ్ ది రైట్ ఆఫ్ ది చైల్డ్(యు ఎన్ సి ఆర్ సి), నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వంటి సంస్థల చొరవతో మనదేశంలో బాలల సంరక్షణ కోసం ఇలాంటి ఒక పటిష్ఠ చట్టం అమలవుతోందని అనురాధనాయుడు పేర్కొన్నారు. అనంతరం బాలల న్యాయంపై సోమ మంగళవారాల్లో జరిగిన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పోటీలో విజేతలు అయినటువంటి విద్యార్థులు నిఖిల్, హర్షిత, తరుణ్ లకు ముఖ్య అతిథి, విభాగాధిపతి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ కే.శివరాం, అభిలాష్ గోపీనాథన్, పరుచూరు కుమారి, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, చెన్నారావు తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, న్యాయ విభాగపు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకాకాని ఇన్‌చార్జి ఎంఈఓగా రమణయ్య

పెదకాకాని: మండల విద్యాశాఖాధికారిగా బీవీ రమణయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పెదకాకాని మండలంలో ఇప్పటి వరకూ విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న సత్యన్నారాయణరాజు బదిలీపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో గుంటూరు పులిపాక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బీవీ రమణయ్యను పెదకాకాని మండల ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు అప్పగించి బదిలీ చేశారు.



కదలనంటున్నాయి!

పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదురు వీధిలోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త, వ్యర్థాలతో పేరుకుపోయాయి. మురుగు నీరు కదలక నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలూ వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను మున్సిపల్ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– పొన్నూరు

వర్మీ కంపోస్టుతో ప్రయోజనాలు

డీపీవో బి.వి. నాగసాయికుమార్

ప్రత్తిపాడు: వర్మీ కంపోస్టు ఎరువుతో అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్ అన్నారు. మండల పరిధిలోని నడింపాలెంలో మంగళవారం డీపీవో పర్యటించారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరిస్తున్న విధానం, అనంతరం ఎస్‌డబ్ల్యూపిసిలో వేరు చేసే పద్ధతిని క్లాప్ మిత్రలు, సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి అంతర్గత వీధుల్లో పారిశుధ్యంను పరిశీలించారు. రక్షిత మంచినీటి చెరువును పరిశీలించి, నీటికి క్లోరినేషన్ చేస్తున్నారా? లేదా అన్న వివరాలపై సెక్రటరీ మూర్తిని ఆరా తీశారు. వెంట ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.